# విజేత

అతను చెప్పింది విని ఆమె కొయ్యబారిపోయింది. ఎన్నో ఆశలు పెట్టుకుంది. ఈ క్షణం కోసం ఎంతగానో ఎదురు చూసింది. కాని రామిరెడ్డి మాటలు ఆమెని శిలావిగ్రహంలా అచేతనురాల్ని చేశాయి.

"ఏమంటున్నావు బావా?" తడారిపోతున్న గొంతుక,అడిగింది అరుణ.

రామిరెడ్డి శూన్యంలోకి చూస్తున్నాడు. అరుణ మాటలు అతని చెవిలో పడుతూనే ఉన్నాయి. కాని జవాబు చెప్పాలంటే.... ఆవేదన. సంఘర్షణ! జీవితానికి – ఆశలకు – ఆశయాలకు మధ్య ఘర్షణ!

"బావా! చాలా ఎదిగిపోయావు. ఎంతగా ఎదిగిపోయావంటే నీ మూలాలు మర్చిపోయేటంతగా ఎదిగిపోయావు!" ఆమె గొంతు వణుకుతున్నది. ఆమె కళ్ళు వర్షిస్తున్నాయి.

"అరూ! నన్నర్థం చేసుకో – నాకు నీ మీద ప్రేమ లేక కాదు – మమత లేక కాదు ... కాని నా బ్రతుకు మీద నాకు ప్రేమ లేక – జీవితం మీద మమకారం లేక – ఇలా అంటున్నాను." రామిరెడ్డి చెప్పాడు నిబ్బరంగా.

"నిన్ను పై చదువులు పంపడం నాన్న చేసిన మొదటి తప్పు. నీ ప్రవర్తన గురించి పట్టించుకోకపోవడం రెండవ తప్పు. నువ్వడిగినంత డబ్బు పంపడం మూడవ తప్పు." ఏడుస్తూ అంది అరుణ.

"చెప్పుతున్నావా అరుణా! దిక్కులేనివాడ్ని చేరదీసి విద్యాబుద్ధులు చెప్పించాడు మావయ్య. దానికి నా కృతజ్ఞతలు! ఆమాటకొస్తే నా జీవితానికి ఒక తోడుగా నిలవాలనుకున్న నీకు ధన్యవాదాలు! కాని..... నా జీవితం సంకుచితమైంది కాదు. అందరిలాగా పెళ్ళి చేసుకుని పిల్లల్ని కంటూ ఇల్లే వైకుంఠం అంటూ బావిలో కప్పలా బ్రతకలేను. నా కళ్ళు తెరుచుకున్నాయి. విశాలమైన ప్రపంచాన్ని చూస్తున్నాను. నా ముందు ఒక లక్ష్యం ఉంది!" ఆవేశంగా చెప్పుకుపోతున్నాడు.

"ఆఁ! ఉందిలే లక్ష్యం! ఆ లక్ష్యం కోసం మమ్మల్ని నిర్లక్ష్యం చేస్తున్నావు. అయినా నీకీ విప్లవాలు – పోరాటాలు ఎందుకు? కడుపులో చల్ల కదలకుండా పడుకోకుండా? లోకంలో ఎంతమంది లేరు అవి చూసుకోవడానికి?" రోషంగా అంది.

"క్షమించు అరుణా! పంది బురదలో దొర్లినట్లు ఇన్నాళ్ళు ప్రవర్తించాను. నేడు నా పవిత్ర లక్ష్యమనే పన్నీటిలో పునీతుడ్ని అయ్యాను. దీనబాంధవుల కోసం – పీడితుల కోసం – దండతాడితుల కోసం – నా జీవితం అర్పిస్తున్నాను"! అతనిలో రక్తం ఉప్పొంగింది.

"రామిరెడ్డీ! సంఘం ఉద్ధరించే ముందు నీవాళ్ళని ఉద్ధరించాల్సిన బాధ్యత నీకు లేదా?" సూటిగా ప్రశ్నించింది.

"కాని నా వాళ్ళు అనుకునే వాళ్ళు నా లక్ష్యానికి గుదిబండ అయితే నేనెలా ఉద్ధరిస్తాను?"

"ఇరవయ్యేళ్ళు నీతో కల్సి పెరిగిన మేము గుదిబండలమైపోయామా? రెండేళ్ళు చదివిన చెత్త సాహిత్యం ఆత్మీయురాలై పోయిందా? పూర్తిగా చెడిపోయావు. గెటవుట్!" అరుణ తిరస్కారంగా అరిచి లోపలికి వెళ్ళి తలుపేసుకుంది.

రామిరెడ్డి చిన్నప్పుడే వరదల్లో తల్లిదండ్రుల్ని పోగొట్టుకున్నాడు. ఆస్తిని కోల్పోయాడు. కొన్నాళ్ళు దుర్భర జీవితం అనుభవించాడు. ఆ తరువాత అతని దూరపుబంధువైన పరంధామయ్య

తన్ను చేరదీసి పెంచి, చదువు చెప్పించాడు.

పరంధామయ్య ఓ మోస్తరు రైతు. పంటల మీద బాగానే బ్రతికాడు. డబ్బుకు వెనుకాడకుండా అతనికి సౌకర్యాలు చేకూర్చాడు. కాలేజీ చదువులు చెప్పించాడు.

పరంధామయ్యగారి ఏకైక గారాలపట్టి అరుణ. చిన్ననాటినుండి రామిరెడ్డి చుట్టూ తన ఆశలు పెంచుకుంది. తల్లి అనసూయమ్మ అతన్ని అనాథ అని గేలిచేస్తూ ఉన్నా ఆ భావన మనసులో పెట్టుకోకుండా అతనితో ఆడుకుంటూ పాడుకుంటూ ఉండేది.

అనసూయమ్మ రామిరెడ్డికి చిన్నాచితకా దగ్గర్నుండి పెద్దపన్లు దాకా చెప్పేది. అతను కాలేజీ చదువుతుండగా ఆమె కాలం చేసింది. అతని చదువు పూర్తయింతర్వాత అరుణకిచ్చి పెళ్ళిచేయాలనుకున్న ఆమె ఆశ ఫలించకుండానే కన్ను మూసింది. ముందుగా గొప్ప అల్లుడ్ని తెచ్చుకోవాలని కోరుకుంది. కాని సంఘంలో జరుగుతున్న ఘాతుకాలు అన్నీ చూసింతర్వాత రామిరెడ్డి అల్లుడైతే ఏ గొడవా ఉండదని – తమ కనుసన్నల్లో ఉంటాడని ఆశ పడింది. అయిన సంబంధం కాబట్టి పరంధామయ్యకు అస్సలుకు అభ్యంతరం లేదు.

తమ పెళ్ళికి ఏ ఆటంకాలు లేవని ఇన్నాళ్ళూ కలలు కంటున్న అరుణకు రామిరెడ్డి అభిప్రాయాలు షాక్ కలిగించాయి.

అణగతొక్కబడినవారట – పెట్టుబడిదారులట – శ్రామికులట – పేదలట – పీడితులట – దళితులట – సాంఘికన్యాయము పొందని దీనులట – ఆర్థిక అసమానత్వం – శ్రమదోపిడీ – వర్ణవ్యత్యాసం – వర్గపోరాటం – విప్లవ మార్గం – జనచైతన్యం .......

ఇలా ఎన్నో మాటలు చెప్పాడు రామిరెడ్డి. ఇంతకాలంగా అణగదొక్కబడిన దీనులకోసం విప్లవపథం ఎంచుకున్నానన్నాడు.

అతనివి రెండేళ్ళుగా నమ్ముకున్న ఆదర్శాలు! తనవి ఇరవైయేళ్ళుగా పెనవేసుకున్న ఆశలు! తనకున్న మనిషి రామిరెడ్డి ఒక్కడే! కాని ఈ సంఘానికి ఎంతోమంది రామిరెడ్డులు! తండ్రికి ఈ సంగతి తెలిస్తే ఆయన గుండె గుటుక్కుమని ఆగిపోదూ? కొడుకుగా సాకాడు. కూతుర్ని కట్టబెడదామనుకున్నాడు. చేతికి అందిన పంట గాలివానకు రాలిపోయే పరిస్థితి! ఎన్నో లక్షలు గుమ్మరించి వరుడ్ని కొనుక్కోకుండా బ్రతికి పోదామనుకునే నాన్న ఆశకు గొడ్డలివేటు!

"ఏం బాబు ఇక్కడ నిల్చున్నావు? లోపలికి పద?" పరంధామయ్య ఆప్యాయంగా భుజం తట్టేదాకా ఆలోచనల్లో శిల అయిపోయిన రామిరెడ్డి కదలిపోయాడు.

"అరుణా! బావకు అన్నం పెట్టావా?" కేక పెట్టాడు.

"నే పెట్టను – పెట్టుకు తినమను." లోపల్నించి కోపంగా చెప్పింది.

"నువ్వు తిన్నావా – దామ్మా! ఎందుకంత కోపం?" పరంధామయ్య ముసిముసి నవ్వులతో పిల్చాడు. ఏదో గిల్లికజ్జా అయి ఉంటుందనుకున్నాడు.

అరుణకు దుఃఖం ఆగలేదు. తలుపు తెరుచుకుని విసురుగా వచ్చి తండ్రి చెయ్యి పట్టుకుంది.

"చూడు నాన్నా! బావ విప్లవదళంలో కల్సిపోతాట్ట – నన్ను పెళ్ళి చేసుకోడట!" ఏడుస్తూ చెప్పింది.

ఖంగుతిన్నాడు పరంధామయ్య. ఆయనకు విషయం అర్థం కావటానికి అయిదు నిమిషాలు పట్టింది.

"అదేంటి రామిగా - నీకు తెలివి ఉందా - పోయిపోయి ప్రాణం మీదకి తెచ్చుకుంటావా? రేపీపాటికి ఏదో ఎన్‌కౌంటరులో నిన్ను వేసేస్తారు!" బాధగా - కోపంగా అన్నాడు.

"వెధవ ప్రాణాలు పోతాయని భయంలేదు. అవి పట్టుకున్నా ఆగవు. కాని అవి పోయేలోగా కొన్నైనా మంచిపన్లు చేయాలని నా ధ్యేయం". చెప్పాడు.

"నీ మొహం! మంచిపన్లు ఏమిట్రా మంచిపన్లు, చట్టాన్ని ఎదిరించి ఎక్కడికి పారిపోతావు. అయినా నీకివేం బుద్ధులు. చక్కగా అరుణని పెళ్ళిచేసుకుని - సుఖంగా ఉండు. నీముందు గులాబీ బాట వేస్తూ ఉంటే - ఇనుప ముళ్ళదారి తొక్కుతానంటావేంటి?" విస్తుపోతూ అడిగాడు.

"చూడు మావయ్యా! నా విషయాలు ఎవ్వరికీ చెప్పకూడదనుకున్నాను. కాని కన్పించినప్పటినుండి అరుణ పెళ్ళీ పెళ్ళీ అంటూ వెంటబడుతూండేసరికి చెప్పక తప్పలేదు". చిన్నగా చెప్పాడు.

"అయితే ఇప్పుడేమంటావు? అరుణని చేసుకోవా?" కోపంగా అడిగాడు పరంధామయ్య.

"అదే నాన్నా అతను అనేది!" ఏడుస్తూ చెప్పింది.

"ఏం నీకు నచ్చలేదా? నీ అంతస్తుకు తగదా?" వ్యంగ్యంగా అడిగాడు.

"మావయ్యా! నన్ను క్షమించు ..... నవసమాజం ఏర్పడిన తరువాత నేను అరురణను చేసుకుని సుఖపడతాను". వాగ్దానం చేశాడు.

పరంధామయ్య పిచ్చిగా నవ్వాడు - "అప్పటికి మీరు బ్రతికి ఉంటారేమోకాని నేను బ్రతికుండను .... నేను మటుకు అసంతృప్తితోనే మరణించాలా బాబూ! మావయ్యగా కాదు - పెంచిన మమకారంతో అడుగుతున్నాను. నా ఈ ఆఖరి కోరిక తీర్చు బాబూ!" చెప్పాడు దీనంగా.

హృదయాన్ని ఎవరో పిండినట్లయింది. కన్నీటిపొరతో అరుణ చూస్తూ ఉంది. గొంతుకు ఏదో అడ్డం పడినట్లయింది.

"నా ప్రపంచం సువిశాలమైంది. నా లక్ష్యం ఆకాశమంత ఉన్నతమైంది. నవసమాజ స్థాపన, అందరికీ వస్తు పంపిణీ సమంగా జరగాలి. అవసరమున్నవాడికి అవసరం చాలినంతా అందాలి! ఆ సమాజంలో అగ్ర కులం, నిమ్న కులం ఉండదు. ధనికులు, పేదలు ఉండరు. ఉండేది మనుషులు మాత్రమే!. అన్ని వృత్తులవారు సమానంగా గౌరవించబడాలి. చెప్పులు కుట్టేవాడి శ్రమశక్తి - మందులిచ్చే డాక్టరు శ్రమశక్తి ఒకటే కావాలి. కాకపోతే ఎవరి అవసరాలను బట్టి వారు లబ్దిపొందాలి. అక్కడ కులం లేదు - మతం లేదు - వర్గం లేదు. అందరికీ అన్నీ సమకూరుతాయి. అందరూ సమాజం కోసం బతుకుతారు!" ఆవేశంగా చెప్పాడు.

అరుణ నిశ్శబ్దంగా వింది. పరంధామయ్య ఆలోచనలో పడిపోయాడు.

"అయితే ఈ సమాజ స్థాపనకు కుటుంబంతో పని లేదా? కుటుంబ విచ్ఛిన్నతితో ఇది సాధ్యమా బావా? ఆ సమాజంలో భార్యాభర్తలు, పిల్లలు ఉండరా? కనీసం అందుకోసమన్నా...." ఏడ్పు ఆపుకుంటూ అంది.

"ఉంటారు ..... కాని ఇప్పుడు కాదు - మా ఆచరణ మార్గం క్లిష్టతరమైంది. అరచేతిలో ప్రాణాలు పెట్టుకు బ్రతుకుతున్నాం - తుపాకులు తప్పించి ఇంకే బరువు బాధ్యతా పెట్టుకున్నా మోయడం కష్టం -" సంకోచిస్తూ చెప్పాడు.

"బాబూ! నువ్వు చెప్పే సమాజం రష్యాలోనే లేదు. చైనాలో కూడా లేదు. విప్లవభావాలు

ఉద్భవించిన ఆ దేశాల్లోనే లేనప్పుడు ఈ వేదభూమిలో సాధ్యమా?" పరంధామయ్య అడిగారు. "అక్కడే విఫలమయ్యాయిబాబు."

"హ్హా! వేదభూమి!ఇప్పుడు కాదు. అప్పుడు! ఇది వేదనాభూమి - ఆవేదనా భూమి! ఆ దేశాల్లో లేని సమాజాన్ని మన దేశంలో స్థాపించడానికి ప్రయత్నించడంలో తప్పులేదుగా." దృఢంగా చెప్పాడు.

ఆ ముగ్గురికి కంటిమీద కునుకులేదు. ఒకే గూడులో ఉన్నా వేరు వేరు ఆశయాలు! అంతరంగాలలో అంతరం నిరంతరం ఈ తరంలోతప్పదు.

నిద్రలేచి చూసేసరికి బావ కనిపించలేదు. చీకట్లో మాయమైపోయాడు.

"అరుణా! నాగురించి దిగులుపడొద్దు. పెళ్ళంటూ చేసుకుంటే నిన్నే చేసుకుంటాను. చుట్టూ ఉన్న దుర్గంధాన్ని పీలుస్తూ సుఖపడ్డం నాకు చేతకాదు. కనీసం ఆ దుర్గంధాన్ని తొలంగించడానికి ప్రయత్నిస్తాను. అందరిమోహాన సుఖపడే యోగం ఉండదు. అయినా మా నాయకుడిని మన విషయం అడిగి వస్తాను - మళ్ళీ కలిసేదాకా ఎదురు చూడకు. మావయ్యకు - నీకు - నా కృతజ్ఞతలు - నా గురించి వెతకద్దు - వెతికించవద్దు -- బావ."

రెపరెపలాడుతున్న ఆ ఉత్తరం చూసి భోరున ఏడ్చింది.

రోజులు, వారాలు గడుస్తున్నాయి. పరంధామయ్య దిగులుతో మంచమెక్కాడు. పేపరు చదవటం ఆయన కలవాటు. అరుణ కూడా అలవాటు చేసుకుంది. ఎన్‌కౌంటర్లు - విప్లవకారుల వీర మరణాలు -- వగైరా వగైరా ఆసక్తితో చదివి బాధపడుతూండేది.

"అమ్మా! నేను పోయేలోగానన్నా వాడు వస్తాడా? వాడ్ని నీ చేతుల్లోపెట్టి ఈ లోకం విడుస్తా -" ఆయాసపడ్తూ చెప్పాడు పరంధామయ్య.

"నాన్నా! వ్యక్తికంటే సంఘం ముఖ్యం! ఆ సంఘంకు, ధ్యేయం ముఖ్యం... బావ మామూలు మనిషి కాదు. అతని కోసం ఎదురుచూస్తూ ఆనందంగా గడిపేద్దాం -" అరుణ కన్నీరు తుడుచుకుంటూ చెప్పింది.

"నేనే మోగడుపుతానమ్మా! ఈడొచ్చిన పిల్లవి - ఇంకా పెళ్ళి ఎందుకు చేయలేదంటూ నలుగురూ ఉమ్మేస్తుంటే ఎలా తలెత్తుకోనమ్మా! పైగా - నా తదనంతరం ఈ ముళ్ళలోకంలో ఎలా మనగలుగుతావమ్మా!" బాధగా చెప్పాడు.

అరుణకు తండ్రి ఎక్కువకాలం బ్రతకడనిపించింది. ఈ మధ్య పీడకలలు వస్తున్నాయి. అందుకే ఒక నిశ్చయాని కొచ్చి కొన్ని పేపరులలో ప్రకటన లిచ్చింది.

బావా! నాన్న నీ గురించి దిగులు పెట్టుకుని మంచం ఎక్కాడు. ఎక్కడున్నా వెంటనే రావాలి. నీ దారికి మేం అడ్డుకాం -ఒక్కసారి చూసిపో - నీ మరదలు,

అది బావ చూడాలని ఆమె ఆశ - మరీ వివరాలిస్తే బావ మనుగడకే ముప్పు అని ఆమె భయం! అందుకే ఓ ప్రముఖ దినపత్రికలో ఓ వారం వరుసగా ఇచ్చింది.

అయినా ఆమెకు ఏమూలో అపనమ్మకం - మావ ఆ ప్రకటన చూడడని. చూసినా తన ధ్యేయంలో పట్టించుకోడని, పట్టించుకున్నా వచ్చి చూసిపోవడానికి అంత సమయం ఉండదని.

రోజులు - వారాలు గడిచిపోయాయి.

పరంధామయ్య రామిరెడ్డి రాక కోసం చూసి చూసి వ్యథాభరిత హృదయంతో కన్నుమూశాడు.

వియోగి

అరుణ గుండె పగిలింది.

పదిమంది పదిరకాలుగా చెప్పుకున్నారు – రామిరెడ్డి కనపడకపోవడం గురించి.

బావ వచ్చేదాకా శవం కదలడానికి వీల్లేదని అరుణ భోరున విలపించింది.

అది గ్రామం కాబట్టి, గ్రామస్థులు ఆమె కష్టాన్ని తమదిగా భావించి అన్ని కార్యక్రమాలు మొదలెట్టారు. పాడెపైకి లేపేటప్పుడు ఎక్కడ్నుంచో ఊడిపడ్డాడు రామిరెడ్డి.

అరుణ అతన్ని వాటేసుకుని కన్నీటి వర్షం కురిపించింది. రామిరెడ్డి గుండె కరిగి నీరయి కారింది. తన జీవితం మీద, సమాజం మీద విరక్తి పుట్టింది. కనకపోయినా కన్నతండ్రిలా పెంచిన పరంధామయ్య మరణానికి తనే కారణమన్నట్లు అనేకమంది గుసగుసలు పోవడం విన్నాడు. బరువెక్కిన గుండెతో అంత్యక్రియలు చేశాడు రామిరెడ్డి.

పిండం పెట్టగానే కాకి కావుకావుమంటూ వచ్చింది గాని..... ముట్టుకోలేదు.

ఎవరు ఎంత ప్రయత్నించినా కాకి పిండం చుట్టూ తిరుగుతూనే ఉంది కాని ముట్టుకోలేదు.

"బాబూ! అరుణ పెళ్ళి గురించే ఆయన దిగులు". ఎవరో పెద్దాయన రామిరెడ్డితో చెప్పాడు.

"మావయ్యా! అరుణ గురించి నువ్వు దిగులుపడద్దు. ఈలోకంలో మిగిలిన ఏకైక ఆత్మీయురాలు ఆమె. నేను ఎక్కడున్నా ఆమె క్షేమం కనుక్కుంటూనే ఉంటాను"–అని వాగ్దానం చేశాడు. కాకి వచ్చి పిండం మీద వాలింది.

తన కర్తవ్యాన్ని గుర్తుకు చేసుకుని దినాలయి పోయిం తర్వాత బయలుదేరుతానని చెప్పాడు రామిరెడ్డి.

"బావా! నిన్ను ఆపేశక్తి నాకు లేదు. ఊళ్ళోవాళ్ళని వెర్రివాళ్ళను చేస్తున్న నా అందం నీ దీక్ష ముందు గుడ్డిగవ్వకు కాకుండా పోయింది. అందుకే నేనే నీవెంట వద్దామని నిశ్చయించుకున్నాను". అరుణ చెప్పింది.

"అరూ! పిచ్చిదాన్లాగా ఆలోచించకు. వ్యవసాయం చేయిస్తూ ఈ పల్లెలో ఉండిపో. ఒక ఊరువాడ, ఇల్లు వాకిలీ లేకుండా తిరిగే బ్రతుకు నాది. కొండలు – అరణ్యాలు మా ఆశ్రయాలు. విప్లవం మా ఆశయం..... మాది ముళ్ళబాట – దయచేసి అటువంటి సాహసం చేయకు"! రామిరెడ్డి బాధగా అన్నాడు.

"అన్నీ నిజం కావచ్చు – కాని నా బావలేని ఇల్లు నాకు వల్లకాడు – అతని సాన్నిధ్యమే నాకు సాయుజ్యం!" కన్నీటిపొరతో అంది.

"సారీ! అరూ! సాధ్యంకాదు – నువ్వు రావడానికి సిద్ధపడ్డా నే తీసుకుపోలేను. అర్థం చేసుకో!" తల తిప్పుకుని చెప్పాడు.

కొన్ని నిమిషాలు నిరుత్తరురాలైపోయింది. మౌనం రాజ్యమేలింది. గొంతు పెగుల్చుకుని అంది.

"ఇన్నేళ్ళ నా సాహచర్యం నీమీద యిసుమంత ప్రభావం కూడా చూపించలేకపోయింది. కనీసం నాన్నగారి ఆఖరి కోరిక అన్నా తీరుస్తావా?" ఆర్తిగా అంది.

"ఏంటది?" పొడిగా అడిగాడు.

"మన పెళ్ళి గురించి. అదే ఆయన ఆఖరి కోరిక. ఈ ఇంట్లో నన్ను పెళ్ళికూతురిగా చూడాలనుకున్నాడు. మనిద్దరం భార్యాభర్తలమైతే పొంగిపోయేవాడు."

"కానీ నే ఉన్న పరిస్థితుల్లో పెళ్ళి నాకు –" నాన్నాడు.

"భయపడకు బావా! పెళ్ళిచేసుకోమన్నానే కాని – నా దగ్గర ఉండిపొమ్మని చెప్పలేదు. నా మెళ్ళో మూడు ముళ్ళు వేసి నీ ఆశయాల కోసం నువ్వు వెళ్ళు – ఆ మూడు ముళ్ళు చూసుకుంటూ జీవితాన్ని గడిపేస్తాను. ఈ జన్మకీ వరం ప్రసాదించు ప్రభూ!" అతని కాళ్ళ మీద పడిపోయింది. కన్నీటిబొట్లు అతని పాదాల్ని ప్రక్షాళనం చేస్తున్నాయి.

రామిరెడ్డి కదలిపోయాడు. ఆమెని లేవనెత్తి నుదిటిమీద చుంబించాడు.

"నీ ఇష్టప్రకారమే కాని అరు! ఎక్కడున్నా నీవాడిగా ఉంటాను ఎల్లకాలం."

మరునాడు గుళ్ళో పెళ్ళికి నిర్ణయం జరిగిపోయింది. ఎంత మరదలైనా – ఎంత బావైనా – మామయ్య కోరిక ప్రకారం సాంప్రదాయంగా జరగాలి కాబట్టి – కావలసిన వస్తువులు తీసుకురావడానికి పట్నం బయలుదేరాడు రామిరెడ్డి.

ఆ రాత్రి హఠాత్తుగా పోలీసులు అరుణ ఇంటిమీద దాడి జరిపారు. ఇల్లంతా కల్లోలం చేసేశారు. రామిరెడ్డి ఉనికి గురించి వివరాలు అడిగారు.

అరుణను పోలీసుస్టేషన్‌కు లాక్కొచ్చారు. తనకేం తెలీదని చెప్పినా వినకుండా–ఆమెను జుట్టు పట్టుకుని లాగి లెంపకాయ కొట్టాడు పోలీసు. బూటుకాలితో తన్నాడు ఇంకోడు.

పుట్టి పెరిగిన దగ్గరనుండి పల్లెత్తుమాట పడని, ఒంటి మీద చెయ్యిపడని అరుణ నిశ్చేష్టురాలై పోయింది. మెదడు మొద్దుబారిపోతూన్నది. పోలీసుల గురించి చదివింది. కానీ ప్రత్యక్షంగా చూడ్డం ఇదే మొదటిసారి. యస్సై ముందు వక్రంగా నవ్వాడు.

"ఒసే – నీకు ఐదు నిమిషాలు టైమిస్తున్నా – ఈలోగా నువ్వు నీ మొగుడు ఎక్కడుండేది – ఎక్కడ తిరిగేది – వాళ్ళ ముఠా ఏది – అన్ని వివరాలు చెప్పాలి. లేదా ..... నేనసలే .... మంచోడ్ని కాదు". భయంకరంగా నవ్వాడు మళ్ళీ. సిగరెట్టు పొగ మొహం మీద ఊదాడు. ఉక్కిరిబిక్కిరి అయింది.

"నాకేం తెలీదు – మీరెవరనుకుని ఎవర్ని తెచ్చారు. మేం గౌరవంగా బ్రతికేవాళ్ళం – మీరెన్నిసార్లు అడిగినా తెలియని విషయాలు ఎలా చెప్పేది?" ఏడుస్తూ చెప్పింది.

"సరే .... నీకోసంగతి తెల్సా – ఆడదానికి ప్రాణం కంటే మానం ముఖ్యమట – అదే శీలం .... అది కాపాడుకోవాలంటే ఇంకోసారి ఆలోచించుకో –– తర్వాత ఏమనుకున్నా లాభంలేదు!" యస్సై క్రూరంగా నవ్వాడు. పురుగును చూసిన గ్రద్దలా ఉంది అతని నవ్వు.

"అన్నా! చెయ్యెత్తి దండం పెడతా – మీకు అక్కలు – చెల్లెళ్ళు లేరా? నన్ను హింసిస్తే మీకేమొస్తుంది.... మనది ప్రజాస్వామ్య మంటారే...... పౌరహక్కులున్నాయి అంటారే – స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఉన్నాయంటారే – ఇవేనా? ఏ తప్పు చేయని ఓ అబలని పోలీసు లాకప్‌లో పెట్టడమేనా ప్రజాస్వామ్యం. ఓ స్త్రీని శిక్షించడమేనా ప్రజలకు రక్షణ ఇవ్వడం!" ఏడుస్తునేవాపోయింది.

అంతే! ఆమె చెంప పగిలిపోయింది. తరువాత – మాయని మచ్చలా – ప్రజాస్వామ్యానికి తీరని కళంకంలా – పశుత్వానికి ప్రతీకగా – దోపిడీకి నిర్వచనంలా – మానవత్వానికి సిగ్గుగా ఆమె శీలం గాల్లో కలిసిపోయింది.

తొలికోడి కూస్తుండగా ఎవరో జీపులోతెచ్చి ఆమెని వరండాలో విసిరేసి వెళ్ళిపోయారు.

జరిగింది పెద్దషాక్! చేతనాచేతనల మధ్య స్థితి!

ఏం తప్పు చేసిందని తనకీ శిక్ష విధించబడింది. కోడికూతతో పాటు అరుణ శీలం పోయిన

సంగతి ఊరుకు వినిపించింది. వారి వారి సంస్కారం పట్టి దాన్ని అర్థం చేసుకున్నారు.

చదువుకున్న మేష్టారు రామిరెడ్డికి ఓ కుర్రాడితో అంతకుముందే కబురు పంపాడు పట్టణానికి. కాని అప్పటికే ఆలశ్యం అయిపోయింది.

రోడ్డు మీద బస్సు దిగి పొలాలకడ్డం పడి నడిచి వస్తున్న రామిరెడ్డి పోలీసుల దృష్టిలో పడనే పడ్డాడు. అతను పడటం ఆలశ్యం.... అతని మీద గుళ్ళ వర్షం కురిసింది. రామిరెడ్డి కుప్పకూలిపోయాడు. అతని చేతిలో తాళి బిగుసుకుపోయి ఉంది. ఆ చేతిని పైకెత్తి పట్టుకున్నాడు.

తుపాకుల చప్పుళ్ళకు పొలాలకు పోతున్న రైతు కూలీలు పరిగెత్తుకుంటూ వచ్చారు.

నెత్తురు మడుగులో రామిరెడ్డి – అవాక్కులై పోయారు.

"ఎన్‌కౌంటర్!"

"బూటకపు ఎన్‌కౌంటర్!"

" కోల్డ్ మర్డర్!"

రకరకాల వ్యాఖ్యానాలు వినవస్తున్నాయి.

ఎవరో ఈవార్త అరుణకు చెప్పడానికి పరుగెత్తారు.

ఆ గ్రామంలో గాలి స్థంభించిపోయింది.

వార్త విని సుడిగాలిలా పరుగెత్తుకుంటూ వచ్చింది అరుణ. రక్తపు మడుగులో తన బావని చూసేసరికి దుఃఖం తుఫాను అయింది. అతని తలని తన ఒళ్ళో చేర్చుకుంది.

ఆమె కన్నీరు అతని మొహాన్ని తడిపింది. కొనప్రాణంతో కళ్ళు తెరిచాడు రామిరెడ్డి.

"బావా! బావా! నువ్వు బ్రతకాలి! ఈ రాబందుల్ని కాలరాచేందుకు బ్రతకాలి. నువ్వు కోరుకున్న ఆర్థిక సమానత్వాన్ని సాధించేందుకు బ్రతకాలి! ఈ దోపిడీదారులను అంతం చేసేందుకు బ్రతకాలి – బావా! నీ ప్రాణం తీసిన తోడేళ్ళే నా శీలం దోచుకున్నాయి. ప్రాణం లేక నువ్వు శవానివి.... శీలం లేక నేను జీవచ్ఛవాన్ని – నాన్నగారి ఆఖరు కోరిక తీర్చకుండానే పోతున్నావా బావా!" విలపించింది.

ఒంట్లో శక్తినంతా కూడకట్టుకొని తాళి ఆమె మెడకు బిగించాడు రామిరెడ్డి!

అంతే! తృప్తిగా కళ్ళు మూశాడు!

దూరంగా నుంచుని చూస్తున్న పోలీసు దగ్గరికి వచ్చాడు తుపాకీ పట్టుకుని బూతులు తిడుతూ! అంతే! అరుణ అపరకాళి అయింది.

ఒక్క ఉదుటున ఊహించనంత వేగంగా పైకిలేచి ఆ పోలీసు చేతుల్లోంచి తుపాకీ లాక్కుని – బాయనెట్ కత్తితో అతని గుండెల్లో పొడిచింది.

పోలీసు రామిరెడ్డి శరీరం మీద పడిపోయాడు. అతని గుండెలోంచి కారుతున్న నెత్తురు రామిరెడ్డి పాదాల్ని తడుపుతున్నాది.

అరుణ నెత్తురు తిలకం దిద్దుకుంది.

"రామిరెడ్డి అమర్ హై!" – ఆ కేకతో గ్రామం మారుమ్రోగింది.

"విప్లవం వర్థిల్లాలి!" గర్జించింది అరుణ తుపాకీ పైకెత్తి.

"విప్లవం వర్థిల్లాలి!" ఎన్నో గొంతులు శృతి కలిపాయి. విప్లవాలు ఎక్కడో పుట్టవు. మండే గుండెల్లోనే పుడతాయి! ★

